గొప్పతనానికి రాస్తా

# వీరుడి మరణం

వి. యస్. అవధాని

"మోహన్ ఇంకా రాలేదా?"

"రాలేదు...ఎక్కడికి వెళ్లారో?"

"ప్రతి చిన్నదానికీ అలా భయపడకూడదు లలితా."

"భయపడి ఏం చేయగలను! భయపడక చేసేదేముంది?"

"నీ మనసులో ఎంత ఆందోళనగా ఉన్నదో నాకు తెలుసు."

"ఊరంతా ఇంత గోలగా ఉంటే తను ఎందుకు ఇల్లు వదిలి పోయినట్లు? వదిలిపోయారే అనుకో పన్నెండు గంటలయినా తిరిగి రారేం?"

"అతను మగవాడు...బయటికిపోయి పని చేసుకోవాల్సిన వాడు."

"పని చేసుకోవద్దని నే నన్నానా?... సినిమాహాళ్లదగ్గర ఆడవాళ్ల గేటుదగ్గర నిలబడడం...ఎక్కడన్నా అందమయిన ఆడది కనిపిస్తే వెంబడి పడడం... ఇవీ అవసరమైన పనులేనా? ఇంతకూ..."

"లలితా ... అనవసరంగా దిగులుపడుతున్నావ్... మోహన్‌ని అనుమానిస్తున్నావ్. నీ అనుమానంలో నీకు తెలియకుండా అతణ్ని చెడు మాట లంటున్నావు... ఇది పగలు. ఇప్పుడు సినిమాలు లేవు. పైగా..."

"అందుకనే...నా యీ భయమూ, అనుమానమూ."

"చూడు ... జనం ఎట్లా పరుగెత్తుతున్నారో..."

"ఎక్కడికి పరుగెత్తుతున్నారు?"

"ఎక్కడికేమిటి?... రైలుస్టేషనుకి... పోస్టాఫీసుకి... ఒక చోటికేమిటి? ప్రతి గవర్నమెంటు ఆఫీసుకీ..."

"పోయి...ఏం చేస్తారు!"

"అన్నీ తగల పెడతారు."

"అవి తగలపడితే మనకేం ప్రయోజనం!"

"దుష్ట ప్రభుత్వం నశిస్తుంది."

"శ్యామలా...ఈ మాటలే నాకర్థం కావు ఎవరు దుష్టులు? మీ నాన్న కలక్టరు. ఆయన దుష్టుడా? మా మామగారు జడ్జీ...ఆయన దుష్టుడా?...వీళ్లను చంపినంత మాత్రాన లేక వీళ్ళ ఆఫీసులు నశించినంత మాత్రాన ప్రభుత్వం నశిస్తుందా?...తిని కూర్చోలేక చేసేపనులు... ఉద్రేకం ఎక్కువయితే మనం కూడా జంతువుల మవుతాం."

"లలితా, దేశం అంతా పోరబడుతోందంటావా?"

"దేశం అంతా అంటే ఎవరు?"

"అంత లోతుగా నాకు తెలియదు. వీళ్లందరూ ప్రభుత్వాన్ని స్తంభింప చేయనున్నారు. మహా విప్లవం ఒకటి వస్తోంది. అందులో మోహన్ మాత్రం తన పాత్ర నిర్వహించవద్దూ."

"అదుగో...అదే నాభయం. ఈ మోహన్ ఆ సుడిగుండంలో పడి ఏం చెయ్యగలడు?"

"తనకి చేతనయింది చేస్తాడు!"

"మనంకూడా పోదాం పద. మన చేతనయింది మనంమాత్రం చేయలేమా?"

"అవసరం వచ్చినపుడు మనమూ చెయ్యాలి. ఇవాళ మన అవసరం రాలేదేమో."

"శ్యామలా...నాకు తలనొప్పిగా ఉంది."

"పోయి పడుకో. నేనూ వెళ్తున్నా."

మిట్టమధ్యాహ్నం ఎండ అంతగా లేకపోయినా చిటపట లాడుతోంది. ప్రజలు తమ దేశభక్తి నంతా చూపుతున్నారు. కొట్లన్నీ మూయిస్తున్నారు. కాఫీహోటళ్లు మూయించారు. ఎక్కడి రైలును అక్కడ ఆపివేశారు. ఒక రైలుపెట్టెను తగులపెట్టారు. "నేనూ మీ వంటి వాణ్నేనన్రో" అంటూన్నా ఒక గార్డును తన్నారు. ఒక టికెట్ కలక్టరు డ్రస్సు వూడ

దిసి ఖద్దరు గుడ్డలు కట్టించి "గాంధీకి జై" అనిపించారు. చివరికి స్టేషన్ తగలపెట్టారు. ఎంత దేశభక్తి, జాతికి ఎంత గౌరవం!

ఆ ప్రవాహంలో అమాయికులు, నిరక్షరాస్యులు, రాజకీయాలు తెలియనివారు, పనుల మీద వెళ్ళేవారు... అనేక రకాల వాళ్ళున్నారు.

* * *

"పోలీసులు వచ్చారు."

"ఎక్కడినుంచి వచ్చారు...? పొద్దుటనుండీ ఉన్నారుగా!"

"వాళ్లు కాదు. గుంటూరునుండి వచ్చారు."

"ఎక్కడ ఉన్నారు?"

"పాతవంతెనమీద."

"ఏం చేస్తున్నారు?"

"ఏం చేస్తుంటే మనకు దేనికి? మనం ఇంటికి పోదాం."

"ఏం అక్కడికి పోయి చూడరాదూ?"

"మోహన్, అటు వెళ్ళవద్దు. అటు వెళ్ళడం నీ వంటివానికి తగదు. అదొక మంద. అది ఏం చేసినా చేస్తుంది. దానిమీద పోలీసులు ఏం చేసినా చెయ్యవచ్చు. కలక్టరూ, డి. యస్. పీ. కూడా వచ్చారట."

"నేను వెళ్ళివస్తాను. నువ్వు..."

"మోహన్, వద్దు - నా మాట విను."

మోహన్ వినడు: వినలేదు. ఎందుకు వింటాడు! అతనిలోది భారతీయరక్తం కాదా? తనుమాత్రం వీరుడు కానక్కరలేదా? ప్రతినేవాళ్లూ ఇటువంటి అవకాశాలను వాడుకొని గొప్పవాళ్లవుతారు. తనుమాత్రం కాకూడదా? ... అయినా అక్కడికి పోయి తాను ఏం చేసి గొప్పవాడవుతాడు? నడుస్తునే ఉన్నాడు—

'నీకు నడవడమే చేతకాదు. ఏం గొప్పపని చెయ్యగలవు' అన్నాడు తనలోని రెండో వాడు.

'ఎవరూ చెయ్యలేని పని ఒకటి చేసి గొప్పవాణ్నవుతాను' - తను.

'అది అంత సులభం కాదు. అన్నంలోకి నెయ్యి లేకుంటే బ్రతకలేనంత అవస్థ పడతావు- నువ్వు ఏం చెయ్యగలవు?'

"ఏం చెయ్యగలనో చూస్తావు" అంటూ మోహన్ వంతెన దగ్గరకు వెళ్ళాడు. అంతా జనం క్రిక్కిరిసి వున్నారు. "ఇంత వెతకుంటే మనం చేసేదేం ఉంటుంది?" అనుకుంటూ అందర్నీ తప్పించుకుని నెమ్మదిగా ముందుకు పోయినాడు.

జనం ఒకసారి వెనక్కి, ఒకసారి ముందుకు నడుస్తున్నారు. పోలీసులు బారులుతీర్చి జనాన్ని ముందరికి రావద్దని హెచ్చరిస్తున్నారు. వీళ్లు వినరు. వింటే పరువు ఏంగాను? దేశం ఏమయిపోను?

'వీళ్ల దగ్గర ఉన్నవి ఖాళీ తుపాకులు.'

"కాదు."

"మీకెట్లా తెలుసు?"

'వీళ్లు రిజర్వు పోలీసులు. తప్పక వాళ్ల తుపాకులలో తూటాలో గుండ్లో ఉంటయి."

"పొద్దుట్నుంచీ వాళ్లు ఏమయినారు?"

"వాళ్లకు ఈసంగతి ఇప్పుడే తెల్సింది."

"చాలు లేవయ్యా మహా చెప్పవచ్చావు. ఇయిగోనర్రా కట్టెలు. తలా ఒకటీ విసరండి."

"అది పొరబాటు. అటువంటిపని చెయ్యవద్దు. చేస్తే ప్రమాదం మీదే."

"ముందర వీణ్ని తన్నండిరా." జనం కట్టెలు విసిరారు. ఒక పోలీసు టోపీ క్రిందపడ్డది. మరొకని కన్ను ఎగిరింది. మరుక్షణం—ఠాం-ఠాం-ఠాం- ఠాం.

సీమ టపాకాయలంత మోత. తన పక్కగానే పోతున్న గుండ్లు తగలకుండా పక్కగా తప్పుకుంటూ మోహన్ తొలగి పోవాలని అనుకున్నాడు. తన పక్కనున్న ఒక కుర్రాడు అట్లా వాలిపోతుండగా చూశాడు. తనలోని భారతీయ రక్తమూ, ఆంధ్ర పౌరుషమూ, ఉబికినయి. కాని తానేం చెయ్యగలడు! ఆ కుఱ్ఱవాణ్ని చేతులలోకి తీసికొని జనంలోకి పోతేసరి. జనానికి వాణ్ని చూసి...

"ఠాం ఠాం ఠాం ఠాం ఠాం" ఇంకోవరుస. మోహన్‌కి చెమట పోసింది. నరాలన్నీ వణుకుతున్నయి. ధైర్యం అంతా ఎటో పరుగెత్తింది. ఖంగారు జాస్తి అయింది.

"అదుగో, గుండు-తప్పుకో" తనలోని రెండోవాడు.

"నేను..." ఠాం. అంతే. మోహన్ వాలిపోయాడు. అతడు దేశానికీ, సంఘానికీ, జాతికీ

సేవచేశాడు. దేశానికి తన జీవితాన్నే అర్పించాడు. ఎందుకు అర్పించడూ?

* * *

కొన్ని సంవత్సరాలు జరిగినయి. అదే యిల్లు, సాయంత్ర సమయం.

"లలితా..."

"రా శ్యామలా, ఇలా కూర్చో."

"నువ్వు చేసేది మంచిపని కాదు, లలితా."

"ఏ పని?..."

"ఏ పనో నీకు తెలియదా?..."

"నా కోరికను నేను తీర్చుకోవద్దంటావా?"

"లలితా... మోహన్ ఎంతో గొప్పవాడు. తన ప్రాణాన్ని దేశానికి అర్పించాడు. అంతటి వాని భార్యవు చెయ్యతగ్గ పని కాదు."

"శ్యామలా, మోహన్ చేసిన గొప్పపనేమిటి? ఎవరికయినా ఎటువంటి సహాయమైనా చేశాడా? తన తెలివి తేటలను ఎక్కువ చేసుకుని ఇతర్ల కుపయోగించాడా? తల్లి దండ్రులనుగానీ, నన్ను గానీ..."

"లలితా...పొరబడుతున్నావు. అతని త్యాగంవలననే నీకు ఈనాటిసంపద లభించింది."

"శ్యామలా, మోటుగాపోయి- తెలివితక్కువగా ప్రాణంపోగొట్టుకున్న మోహన్‌సొమ్ములో ఒక్క దమ్మిడీకూడా నేను తీసుకోను. ఇంత వరకూ తీసుకోలేదు..."

"మరయితే ఆ శర్మ నిన్ను—"

"రేపు మా రిజిష్టర్డ్ మారేజి. నువ్వు కాఫీకి వస్తే బాగుంటుంది సాయంత్రం..."

"నేను రాలేనందుకు క్షమించాలి. నీ సుఖం నువ్వు చూసుకుంటున్నావు. నీలో భారతనారికి సహజలక్షణమయిన ఏకపతి వ్రతం లేదు. అందుకని నేను..."

"నువ్వు రాకపోతే నిన్ను బలవంతం చెయ్యలేను. కాని, శ్యామలా, స్వార్థమే త్యాగానికి మూలం. అది తెలుసుకుంటేనేగాని మనకు కనిపించే యీ అల్లకల్లోలాలకు ఒక తెన్నూ తెడ్డూ కనిపించవు."

శ్యామల విసురుగా లేచిపోయింది.

# "మన్ను తిని మరికొన్నాళ్లు బతికితే"

'మంత్రి శంకర్'

మనదేశం 1951 లోగా ఆహార విషయంలో స్వయం సమృద్ధం కావాలనీ, అప్పటినుండి ఆహారదిగుమతులు తగ్గించబడతాయనీ ప్రభుత్వం వారు చేస్తున్న సూచనలు చూస్తే అది బెదిరించడమో, బోధించడమో, బాధించడమో అర్థంకాకుండా ఉంది. ఏది వున్నా లేకపోయినా సర్వ ప్రాణాధారమైన ఆహారం చాలినంత లేని మానవజీవితం నూనెలేని దీపంతో సమానం.

దేశనాయకులు "ఎక్కువపంట పండించండి" అని పత్రికలలో సందేశాలు పంచినంత మాత్రాన, ఊళ్ళు తిరిగి ఉపన్యాసాలు చేసినంతమాత్రాన ఏ అవకాశాలను పురస్కరించుకొని రైతులు ఉత్సాహంగా పంటలు పండిస్తారో ఆలోచనకు అందడంలేదు.

రైతులైన ప్రతివారూ, ఒకరి సలహామీద పంటలు పండించాలనే ఉద్దేశం కలుగక పోయినా, స్వాభావికంగా శక్తికొలదీ పండించి తాము తృప్తిగాతిని నాల్గురూకలు గడించుకోవాలనే ఆశకలవాళ్లే. కాని తాము కోరినప్పుడు వాన కురిపించుకొని, వద్దనుకొన్నప్పుడు రాకుండా చేసుకొనే శక్తి రైతులకే కాదు, ప్రభుత్వానికే అసాధ్యమైందని గమనించడం అవసరం.

ఆహారోత్పత్తి హెచ్చించమని కొందరు బోధిస్తూంటే, సర్ టి. యస్. వెంకట్రామన్ గారు భారతదేశంలో ఆహారసమస్యా పరిష్కారానికి సంతాన నిరోధం తప్ప శరణ్యం లేదని సూచిస్తున్నారు. ఆ సూచన చూస్తే తాడు చాలదని బావి పూడ్చమన్నట్లున్నది.

పలువురు పలువిధాలైన అభిప్రాయాలు వెదజల్లుతూన్నారేగాని, అవి ప్రజలు యెంత వరకూ ఆచరించగలరు? వారివిజ్ఞాన మేమాత్రం? వారి మనస్తత్వా లెటువంటివని? అని ఆలోచించకపోవడం శోచనీయం.